క్లుప్తంగా

ఏపీఎంగా శ్రీనివాసరావు



చింతపల్లి : చింతపల్లి వెలుగు ఏపీఎంగా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన నాయుడుకు పాయకరావుపేట బదిలీ అయ్యింది. ఆయన స్థానంలో రంపచోడవరం నుంచి బదిలీపై వచ్చిన శ్రీనివాసరావు చింతపల్లి ఏపీఎంగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

సీలేరు: జి.కె.వీధి మండలం సీలేరులో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను సీలేరు ఎస్‌ఐ రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్టు షాపుల నిర్వాహకులకు మద్యం అమ్మవద్దని, లైసెన్స్ నిబంధనలను దుకాణదారులు సక్రమంగా పాటించాలని ,18 సంవత్సరాలలోపు యువకులకు మద్యం విక్రయించొద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి షాపులు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపిస్తామని ఎస్‌ఐ రామకృష్ణ హెచ్చరించారు. మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

సీతారాముల విగ్రహాల ప్రతిష్ట రేపు



చీడిపాలెంలో రామాలయం

కొయ్యూరు : మండలంలోని చీడిపాలెం పంచాయతీ ఐటీడీఏ కాలనీలోని రామాలయంలో సీతారామ లక్ష్మణ విగ్రహాలను ఆదివారం ప్రతిష్ఠించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. గ్రామంలో ఇటీవల రామాలయం నిర్మాణం పూర్తయిందని, ఈ మేరకు విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు.

పాఠశాలను సందర్శించిన ప్రజాప్రతినిధులు



ఆశ్రమ పాఠశాలలో తనిఖీలు నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు

వై.రామవరం: మండలంలోని చింతలపూడిలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను స్థానిక ప్రజాప్రతినిధులు శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలను పరిశీలించి రుచి చూశారు. అలాగే మెనూను పరిశీలించారు. పాఠశాలలోని మరుగుదొడ్లను, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను తనిఖీ చేశారు. మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, సర్పంచ్ పల్లాల సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతలో ట్రాఫిక్ సమస్య



అరకు సంతలో స్తంభించిన వాహనాలు

డుంబ్రిగుడ: మండలంలోని అరకులో నిర్వహించే వారపు సంతలో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రోడ్డుపై సంత నిర్వహణతో అరకు–పాడేరు జాతీయ రహదారిలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. ఇటీవల సంతలో ట్రాఫిక్ సమస్య తీర్చేందుకు డుంబ్రిగుడ ఎస్‌ఐ కె.పాపినాయుడు రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేయవద్దని వ్యాపారులకు సూచించి, ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. అయితే శుక్రవారం యథావిధిగా వారపు సంతలో ట్రాఫిక్ సమస్య మళ్లీ మొదలైంది. సంతలో ట్రాఫిక్ సమస్యతో గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఇంకెన్నాళ్లీ వెతలు?



డుంబ్రిగుడలో పీహెచ్‌సీ



కిల్లోగుడలో పీహెచ్‌సీ

- అందుబాటులో లేని క్వార్టర్లు
- డుంబ్రిగుడ, కిల్లోగుడ ఆస్పత్రుల్లో సిబ్బందికి అవస్థలు
- పట్టించుకోని అధికారులు

డుంబ్రిగుడ: మండలంలోని డుంబ్రిగుడ, కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి క్వార్టర్స్ లేక అవస్థలు పడుతున్నారు. డుంబ్రిగుడ ఆరోగ్య కేంద్రంలో ఏటా రికార్డు స్థాయిలో గర్భిణులతో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో రోగుల ఓపీ ఉంటుంది. డుంబ్రిగుడ పీహెచ్‌సీ పరిధిలో 10 గ్రామాలు, కిల్లోగుడ పీహెచ్‌సీ పరిధిలో 12 గ్రామాలున్నాయి. వందలాది మంది వైద్య సేవల కోసం ఆయా ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. అయితే సమీప ప్రాంతాల నుంచి గిరిజనులు ఎక్కువగా వస్తుంటారు. సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో అత్యవసర సేవలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇందుక ఒక కారణం ఇక్కడ సమీపంలో క్వార్టర్లు లేక పోవడంతో ఆస్పత్రికి దూరంలో ఇళ్ల అద్దెకి తీసుకుని సిబ్బంది ఉండడంతో రాత్రిపూట వారు ఆస్పత్రికి రావడానికి చాలా సమయం పడుతోందని గిరిజనులు వాపోతున్నారు. కిల్లోగుడ ఆరోగ్య కేంద్రంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. సాయంత్రం 6 గంటలకే సిబ్బంది సమీప అరకు, అరకులోయ కేంద్రాలకు వెళ్లిపోతున్నారు. ఈ రెండు ఆరోగ్య కేంద్రాల్లో నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రిళ్లు విధులు నిర్వహించే వైద్యులు, స్టాఫ్‌నర్సులకు భద్రత లేకుండా పోతుందని పలువురు చెబుతున్నారు. రోగులకు వైద్య సేవల్లో రోగుల బంధువులు, సహాయకులు ఆటంకం కలిగించినా, వైద్యులు, సిబ్బందిపై దాడులకు పాల్పడినా పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో నైట్ డ్యూటీలో ఉన్న సిబ్బందికి రక్షణ భద్రత ప్రశ్నార్థకంగా మారిందంటున్నారు. గత్యంతరం లేక బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సి వస్తోందని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డుంబ్రిగుడ, కిల్లోగుడ ఆస్పత్రిలో సిబ్బందికి అందుబాటులో ఖాళీ స్థలాల్లో క్వార్టర్ల నిర్మాణాలు చేపట్టి సిబ్బంది వైద్యసేవలు మరింత చేరువ అయ్యేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

ఈ విషయాన్ని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా వద్ద ప్రస్తావించగా క్వార్టర్స్ నిర్మాణానికి వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ప్రతిపాదనలు పంపించినట్టు చెప్పారు. అనుమతులు వస్తే సిబ్బందికి అందుబాటులో ఉండేందుకు కార్వర్ల నిర్మాణాలు చేపడతామన్నారు.

అవస్థలు తప్పడం లేదు



కిల్లోగుడ పీహెచ్‌సీలో సిబ్బంది రాత్రి పూట అందుబాటులో ఉండకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గ్రామాల్లో ప్రమాదాలు జరిగినా, రోగాల బారిన పడిన వారికి అత్యవసర సేవలకు సమీపంలో కిల్లోగుడ ఆస్పత్రికి రావాల్సి వస్తోంది. అయితే పూర్తిస్థాయిలో సేవలందక నానా అవస్థలు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– వంతల వెంకటరావు, సర్పంచ్, పోతంగి పంచాయతీ

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న స్వర్ణ

ఎటపాక: మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ కోరారు. గన్నవరంలో శుక్రవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ...పోలవరం బ్యాక్ వాటర్ కారణంగా వచ్చిన వరదలతో రైతులు నష్టపోయి వ్యవసాయ పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి హామి పనులు 150రోజుల పనిదినాలకు పెంచాలని ,కొల్లుగూడెం నుంచి మురుమూరు వరకు ఉన్న గ్రామాల ప్రజలకు మిగిలిన మండలాల ప్రజలకు ఇచ్చిన మాదిరిగా జీవనభృతి రూ.4,800 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త పింఛన్లు, ఇటీవల మరణించిన వారి కుటుంబాలకు బీమా వెంటనే చెల్లించాలన్నారు. ఎంపీటీసీ సభ్యుడు కంటె రాజు మాట్లాడుతూ ఎంపీటీసీ నిధుల పనులకు అనుమతులు ఇవ్వకుండా మండల పరిషత్ అధికారులు అలసత్వం వహించడం తగదని, త్వరితగతిన అనుమతులు ఇవ్వాలన్నారు. సర్పంచ్ గడ్డం భద్రమ్మ, వల్లభనేని సత్యనారాయణ, నాగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అందుబాటులో బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సేవలు

సీలేరు: సీలేరు ఎట్టకేలకు బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందుబాటులోకి వచ్చాయి.దీంతో స్థానిక వినియోగదారులు ఆనందం వ్యక్తం చేశారు. సీలేరులో బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేసినప్పటి నుంచి 3జీ సేవలు మాత్రమే ఉండేది. దీంతో ఇంటర్నెట్ తదితర సేవలు సక్రమంగా నానా అవస్థలు పడేవారు. జియో నెటవర్క్ ఉన్నప్పటికీ అధిక ధరల వలన సామాన్యులు ఆర్థిక భారంతో కొంత ఇబ్బందులు పడుతున్నారు. అయితే సీలేరులో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను అధికారి మిథున్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరింత సాంకేతిక పరికరాలు అమర్చి కొద్ది రోజుల్లోనే పూర్తిస్థాయిలో ఫ్రీక్వెన్సీ పెంచి 4జీసేవలకు మార్చనున్నట్టు తెలిపారు.

పోర్టల్‌లో విద్యార్థుల వివరాల నమోదు



ప్రిన్సిపాల్ విజయభారతి

చింతపల్లి: డిగ్రీ కళాశాల విద్యార్థులంతా ఆంధ్రా యూనివర్సిటీ పోర్టల్‌లో తప్పనిసరిగా ఈ నెల 27 తేదీ లోగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయబారతి తెలిపారు. మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థులు అకాడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్(ఎబిసి)తో పాటు ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డు అకౌంట్‌ను, తృతీయ సంవత్సర విద్యార్థులు పై రెండు అప్షన్‌తో పాటు జాబ్‌పోర్టల్‌లో వివరాలన్నీ నమోదు చేసుకోవాలని సూచించారు. పోర్టల్‌లో నమోదు చేసుకోవడం వలన కళాశాల నుంచి చదువు పూర్తి చేసిన విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఉద్యోగ అవకాశాలకు సంబంధించి వివరాలు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా తెలుసుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే 90 శాతం మంది విద్యార్థులు నమోదయ్యారని, మిగిలిన వారంతా తప్పనిసరిగా 27 తేదీ నాటికి నమోదు చేసుకోవాలని కోరారు.

30న ఉపాధి పనులపై ప్రజావేదిక

పెదబయలు: పెదబయలు మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీల్లో భాగంగా ప్రజావేదికను ఈనెల 30న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎల్. పూర్ణయ్య తెలిపారు. మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనం ఆవరణలో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఏడాది కాలంలో సుమారు రూ.23 కోట్ల నిధులకు సంబంధించి అభివృద్ధి పనులకు గాను ఆడిట్ జరుగుతుందని ప్రజావేదికలో జిల్లా డ్వామా అధికారులు హాజరవుతారన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



రహదారులను పరిశుభ్రం చేస్తున్న గౌరీదేవిపేట సచివాలయ సిబ్బంది




జోలాపుట్టులో పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ నీలకంఠం, ఎంపీటీసీ కమల, అధికారులు



డుంబ్రిగుడ పీహెచ్‌సీలో పరిసరాలు పరిశుభ్రం చేయిస్తున్న వైద్యాధికారి రాంబాబు

డుంబ్రిగుడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారి డాక్టర్ పి.రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. సిబ్బందితో పరిసరాలు శుభ్రం చేయించారు. ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మేరకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతి పంచాయతీ కేంద్రాల్లో ఆశ కార్యకర్తలు, సిబ్బందితో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నమన్నారు.పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమతెరలు వినియోగించాలని సూచించారు. సోవ్వా పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి సుధ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది శౌరీ, స్వామి, రవింద్ర, ప్రభాకర్, సంజీవ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



పెదబయలులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో పూర్ణయ్య

ఎటపాక: మండలంలోని గౌరీదేవిపేట పంచాయతీలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సుబ్బయ్య మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం తయారవుతుందన్నారు. ప్రధాన రహదారులను శుభ్రం చేసి చెత్తను తొలగించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

ముంచంగిపుట్టు:మండలంలో గల జోలాపుట్టు, బంగారుమెట్ట, కించాయిపుట్టు పంచాయతీల్లో పలు గ్రామాల్లో శుక్రవారం సర్పంచుల,ఎంపీటీసీల ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహించారు.రహదారికి రెండు వైపులా చెత్తల తొలగింపు, డ్రైనేజీల్లో పూడికతీత చేయించి, బ్లీచింగ్ జల్లించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నీలకంఠం మాట్లాడుతూ ప్రజలంతా పారిశుద్యం మెరుగుకు సహకరించాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వీధులన్నీ శుభ్రంగా ఉంటేనే వ్యాధులు ప్రబలకుండా అందరూ ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఏవో శ్రీనివాసబాబు, ఎంపీటీసీ సభ్యురాలు కమల, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెదబయలు: ప్రతీ ఇంట పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య అన్నారు. ఫ్రైడే–డ్రైడే పురస్కరించుకొని పలు వీధుల్లో సర్పంచ్ సిబ్బంది ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేయించారు. ఎంపీడీవో పూర్ణయ్య మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఇంటి ఆవరణలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఇంట్లో చెత్తను పంచాయతీ పారిశుద్య కార్మికులకు అందజేయాలన్నారు దోమ తెరలు వినియోగించాలన్నారు. పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని కోరారు. సర్పంచ్ పలాసి మాధవరావు, ఎంపీటీసీ సభ్యుడు కిమంకరి బొంజుబాబు, వీఆర్వో ఆజాద్ పాల్గొన్నారు.



లంబసింగిలో కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో ఆషాజ్యోతి, సర్పంచ్ లక్ష్మి

చింతపల్లి: పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎంపీడీవో ఆషాజ్యోతి అన్నారు. లంబసింగిలో శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో శ్రద్ధ వహించాలన్నారు.సీడీపీవో రమణి, సర్పంచ్ లక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నరసింహమూర్తి, ఎస్‌ఐ భూషణం



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సీఐ నరసింహమూర్తి, ఎస్‌ఐ భూషణం

గంగవరం: బాలికల క్రమశిక్షణతో మెలుగుతూ విద్యను అభ్యసించాలని, పాఠశాలలో వసతి గృహంలోగాని ఏ విధమైన శారీరక వేధింపులు జరిగినా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని అడ్డతీగల సీఐ నరసింహ మూర్తి అన్నారు. గంగవరం ఎస్‌ఐ డి.భూషణం ఆధ్వర్యంలో స్థానిక బాలికోన్నత పాఠశాలలో బాలికలకు, ఉపాధ్యాయులకు జువెనైల్ చట్టంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు, సూచనలు ప్రకారం జువె నైల్ చట్టం , బాలబాలికల హక్కులు, చట్టాలుపై ప్రతి పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. బాలికలు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాలికల హక్కులు, చట్టాలపై సీఐ , ఎస్‌ఐలు అవగాహన కల్పించారు. ఎంఈవో టి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం విద్యా ప్రాముఖ్యత వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఓ.భావన ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై బాలికలకు అవగాహన అవగాహన కల్పించారు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి మాట్లాడుతూ బాలికలు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి, కిశోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. నీతి అయోగ్ ప్రతినిధి హేమాధురి, పిడి నాగమణి, మహిళా పోలీసు గంగాభవాని, ఏఎస్‌ఐ రజాక్, సూర్యనారాయణ, హెచ్‌సీ రాంబాబు, హెచ్‌ఎం వరలక్ష్మి, డిప్యూటీ వార్డెన్ లావణ్య, అంగన్‌వాడీ వర్కర్లు సుజాత , కటాక్షం, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు



పింపల్‌గుడలో బల్బు అమర్చుతున్న సిబ్బంది

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ మండలం, పద్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లోని వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నట్టు సర్పంచ్ పెట్టెలి సుస్మిత అన్నారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ సాధారణ నిధులతో పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో 350 ఎల్ఈడీ విద్యుత్ బల్బులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పంచాయతీ పరిధిలోని బొండాంగుడ, పింపల్‌గుడ, దుమ్మగుడ, బోందుగుడ, రణజిల్లెడ, కొత్త కిల్లోగుడ గ్రామాల్లో ఎల్ఈడీ విద్యుత్ బల్బులు అమర్చామన్నారు. మరో వారం రోజుల్లో ఎండపల్లివలస, పద్మాపురం, ప్రధానిపుట్, గత్తరగుడ, చీరాలమామిడి, బీముడువలస గ్రామాల్లో బల్బులు అమర్చుతామన్నారు. ప్రతీ గ్రామంలో విద్యుత్ వెలుగులు నింపడమే తమ లక్ష్యం అని, కొండ దిగువున గ్రామాలు ఉండడంతో విద్యుత్ లైట్లు లేకపోతే గ్రామాల్లో అడవి జంతువులు దాడి చేసే ప్రమాదం ఉందన్నారు. ఈ పరిస్థితి నుంచి బయట పడేందుకు ఈ వీధి దీపాలు ఎంతో ఉపయోగకరమన్నారు.

గ్రామాల్లో శ్రమదానం



రావణాపల్లిలో శ్రమదానంలో పాల్గొన్న ఎంపీడీవో ప్రసాద్



తోటకూరపాలెంలో ఎంపీడీవో బాపన్నదొర ఆధ్వర్యంలో శ్రమదానం

కొయ్యూరు: మండలంలోని రావణాపల్లిలో ఎంపీడీవో ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. గ్రామంలో పేకుకుపోయిన తుప్పలను స్థానికులు తొలగించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమలు రాకుండా మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు.

వై.రామవరం: మండలంలోని పలు పంచాయతీల్లో ఎంపీడీవో కె.బాపన్నదొర పర్యవేక్షణలో డ్రైడే–ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శుల ఆధ్వర్యంలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల దిగువ ప్రాంతంలోని 11 పంచాయతీల శ్రమదాన కార్యక్రమాలను ఎంపీడీవో పర్యవేక్షించి సిబ్బందికి సలహాలు సూచనలిచ్చారు. వైద్య , ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఐసీడిఎస్, సచివాలయ సిబ్బంది కలసి శ్రమదానంతో గ్రామాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైద్యాధికారి రాంబాబు

డుంబ్రిగుడ: మండలంలోని బుధవారం కందిరీగల దాడిలో మృతి చెందిన తల్లీబిడ్డల కుటుంబంలో ఇంటి యజమాని కిల్లో రఘునాథ్‌ని వైద్యాధికారి రాంబాబు పరామర్శించారు. ఆయన బాధిత కుటుంబం స్వగ్రామం జోడిగుడ వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు కందిరీగల దాడిలో మృతుల కుటుంబసభ్యులను వైస్ ఎంపీపీ కంద్రుమ్, ఎంపీటీసీ సభ్యుడు శెట్టి ఆనంద్‌రావు, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు, హరి తదితరులు పరామర్శించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జి.మాడుగుల: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, బంధవీధి బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌ఐ షణ్ముఖరావు మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోలీస్‌ల అమరవీరుల త్యాగాలపై గిరిజనులకు, విద్యార్థులు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కోరారు. వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి సాగు, రవాణా చట్ట రీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. గిరిజన యువతకు క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసు అమరుల కుటుంబాలకు పరామర్శ



హెచ్‌సీ అప్పన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐ దీనబంధు

పాడేరు : విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబాలకు తాము నిత్యం అండగా ఉంటామని పాడేరు సీఐ డి.దీనబంధు స్పష్టం చేశారు. మండల కేంద్రంలో గతంలో అమరులైన హెడ్ కానిస్టేబుల్ కె.అప్పన్న, కానిస్టేబుల్ డి.శివలింగం కుటుంబాలను ఆయన శుక్రవారం కలిశారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాలతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్పుడు ఏ కష్టం వచ్చిన తమల్ని సంప్రదించాలని వారికి సూచించారు.

ప్రిన్సిపాల్‌గా వసుధ బాధ్యతల స్వీకరణ



ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ వసుధ

రంపచోడవరం: రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వసుధ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కృష్ణా జిల్లా మొవ్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బయోటెక్నాలజీ విభాగంలో అధ్యాపకురాలుగా విధులు నిర్వహించారు. పదోన్నతిపై రంపచోడవరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు చక్రవర్తి, శివకుమారి, వెంకటేష్ తదితరులు ప్రిన్సిపాల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.